మినీ కథ

మండోదరి మహిమ

●జి.పద్మనీప్రసాద్

సుబ్బారావు మళ్ళీ బ్రతిమాలడం ప్రారంభించాడు.

"దేవీ -ప్రాణేశ్వరీ! నువ్వే కాదంటే నేనేమైపోవాలి? నాకు మనుగడలేదే. కనికరించి, నా మొరాలకించి, నా అవసరం తీర్చు" అన్నాడు.

మండోదరి బిగుసుకు పోయింది. సమాధానం చెప్పలేదు.

"ప్రియతమా, అనురాగమయీ, రసవాహినీ, కరుణామయీ, నా బంగారు లక్ష్మీ, పాహిమాం పాహిమాం" అన్నాడు దీనంగా.

మండోదరి వదనంలో ప్రసన్నత గోచరించింది. కాని, బింకం సడలలేదు. చిరునవ్వు నవ్వినా ప్రమాదమే అని తెలుసు.

"నీవే తప్ప నితఃపరం బెరుగ మన్నింపన్ దగన్ దీనునిన్, రావే యీశ్వరి కావవే వరదా, సంరక్షింపు మండోదరీ" అంటూ చేతులెత్తేశాడు.

"ఆపండి మీ వేషాలు?" అని గద్దించింది మండోదరి.

సుబ్బారావు నవ్వుతూ యికిలించాడు. మళ్ళీ సకిలించాడు.

"ఈ మాయ మాటలతోనే నన్ను మోసం చేస్తున్నారు. అంత లెక్క లేకుండా ఖర్చులు చేయడం దేనికి- నా ప్రాణానికి పడి పదే పదే దేవిరించడం దేనికి. ఛీ ఛీ" అంది కోపంగా.

"దూషణ భూషణ తిరస్కారములు ఆశీస్సులుగా తలచే వాడికి భలే చాన్సులే -అన్నాడో కవి. నీ కోపం నాకు వరం. నువ్వు యీ ఆపదలో ఆదుకొంటావు. నాకు తెలుసు. నీ మనసు వెన్న." అన్నాడు.

"ఇంతకీ యిప్పుడు మళ్ళీ ప్రాణం మీద కేవొచ్చింది?" అంది మండోదరి.

"అలా అడుగు చెబుతాను. మన విశ్వుగాడు లేడూ, పాపం సైకిలు మీద వస్తూ ఆంబోతుకు 'డాష్' కొట్టేడు. అది వీడ్ని కుమ్మి వదిలేసింది. చావు తప్పి కన్ను లొట్టబోయి ఆస్పత్రిలో వున్నాడు. విషయం తెలిసి అక్కడకు వెళ్ళిన నన్ను చూసి వాడి భార్య కన్నీళ్ళు పెట్టుకొంది.'...మీరు ఆదుకోవాలి అన్నయ్యగారూ" అంటూ రెండొందలు అప్పుడిగింది. నాకు గుండెలు ద్రవించి పోయాయి.'-నీకేం భయం లేదు వెళ్లెమ్మా-నే నున్నాను' అని అభయ మిచ్చి 'ఒరే విశ్వూ, ధైర్యంగా వుండు' అని చెప్పాను. పాపం, వాడికి నా మాట వినబడలేదు. ఒంటి నిండా బ్యాండేజి కట్లు. ప్రాణం పోలేదు గాని ప్రాణాపాయ స్థితి దాటి పోలేదు. కనుక....." మండోదరి సీరియస్‌గా వింది. ఆలోచించింది.

"ఐతే ప్రస్తుతం మీ అవసరం రెండొందలన్న మాట" అంది. సుబ్బారావు ముఖం వికసించింది.

"అంతే. అంతే. రెండొందలు చాలు. ఒక్క పైసా కూడా ఎక్కువ వద్దు."

"మీకు ఎన్నిసార్లు చెప్పినా పరిస్థితి అర్థం చేసుకోబోతే ఎలా? ఇప్పుడు ఉన్న పాళంగా రెండొందలు ఎలా వస్తాయ్. ఎక్కడ తేను?" అంది.

"నా ప్రాణ సఖీ, ఈ ఆపద నువ్వే గట్టెక్కించాలి. విశ్వుగాడి భార్య కన్నీళ్ళు చూడలేను. నా అసమర్థతను సహించలేను. ఈ వెలాఖరులో నాకు డబ్బు దొరకడం కష్టం. నువ్వే ఎలాగైనా చూడాలి. నా బంగారం కదూ. ప్లీజ్" అన్నాడు సుబ్బారావు దీనంగా.

"సరె, ప్రయత్నిస్తాను. పక్కింటి గజలక్ష్మి అడపా దడపా యిస్తుంది. కాని, నూటికి యిరవై రూపాయిలు వడ్డీ. ఫస్టు తారీఖున జమ చేసేయాలి. మీ కభ్యంతరం లేకపోతే అడిగి చూస్తాను" అంది.

"అభ్యంతరమా! నాకా! భలే దానివే. వెళ్ళు. వెంటనే ఆ పని చూడు. పాపం హాస్పిటల్లో విశ్వుగాడి పరిస్థితి-" అంటూ కన్నీళ్ళు పెట్టుకొన్నాడు.

మండోదరి గజ గమనంతో కదిలింది.

సుబ్బారావు యీల వేసుకొని పడక కుర్చీలో కూలబడ్డాడు.

సుబ్బారావుకు యిటువంటి అవసరాలు వస్తూనే వుంటాయి. మండోదరి ఏదో విధంగా సర్దుబాటు చేస్తూనే వుంటుంది. వడ్డీల రూపంలో చాలా డబ్బు తగలేస్తూనే వుంటాడు సుబ్బారావు. ఇది ఒక అనంతమైన ఆర్థిక వ్యూహం.

కాసేపటిలో మండోదరి వచ్చింది. చేతిలో రెండొందలు. "హుర్రే" అని అరిచాడు సుబ్బారావు. అతని వదనం ఆనందంతో వెలిగి పోతూంది. "థ్యాంకు డియర్" అని ఆ రెండొందలు అందుకొని మరుక్షణంలో మాయమయ్యాడు. వీధి తలుపు గడేసుకొని తన పడక గదిలోకి ప్రవేశించింది మండోదరి.

నోట్ బుక్ తీసి ఏవేవో లెక్కలు వేసింది. కూకలు కూడింది. దీర్ఘంగా ఆలోచించింది. నవ్వుకొంటూ మంచం మీద వాలి పోయింది. నెమ్మదిగా నిద్రలో జారుకొంది.

బయట ఎవరో తలుపుకొట్టినట్లయింది. ఉలికి పడి లేచింది. ఇంకా తలుపు చప్పుడవుతూనే వుంది. లేచి వెళ్ళి తలుపు తీసింది. ఎదురుగా వనజ-విశ్వం భార్య

"రండి, ఎండన పడి వచ్చారే!" అంది నవ్వుతూ

"రాక తప్పతుందా- మా ఆయన గోల పడలేక వచ్చాను" అంది నవ్వి.

"అనుకొంటూనే వున్నాను. ఇప్పుడే మా వారు చెప్పారు, మీ వారు హాస్పిటల్‌లో వున్నారని, మీరు రెండొందలు అడిగారని" ఆశ్చర్య పోయింది వనజ.

"నేను నమ్మలేదనుకోండి. ఆయన బుద్ధి తెలుసు కనుక నమ్మినట్లు నటించి అంతా విన్నాను. పరేషాంలొచ్చిన పని చెప్పండి" వనజ నవ్వింది.

"సుమారుగా మీరు చెప్పినదే. మీ వారు కాలు జారి రోడ్డు మీద పడ్డారని, కాలికి ఫ్రాక్చర్ అయి హాస్పిటల్‌లో వున్నారనీ, కనీసం నూట యాభై రూపాయిలు అర్జెంటుగా కావాలని మా వార్ని అడిగారట ఆయన నన్ను అడిగారు. నేను మీ కోసం వచ్చాను"

ఇద్దరూ పగలబడి నవ్వుకొన్నారు.

"సర్లెండి. నూట యాభై యిస్తాను. వడ్డీ పాతిక యివ్వాలని చెప్పండి. అది వసూలు చేసుకొని యింటి ఖర్చులకు వాడండి" అంది మండోదరి.

వనజ తలూపింది.

"ఏమిటోనండీ, యీ సమస్యతో నా బుర్ర చెడిపోతూంది. కాని, నాకు ఒకటే ఆశ్చర్యం. మీ దగ్గర డబ్బు ఎలా వుంటుందా అని! ఎంత ప్రయత్నించినా నాకు పైసా మిగలదు. వారి సంగతి మీకు తెలుసు దుబారా మనిషి" అంది వనజ.

"అది పెద్ద రహస్యం-చెప్పకూడదు" అంది మండోదరి.

"నా దగ్గరకూడా మర్మమేనా?" అంది వనజ నవ్వుతూ.

"భలేవారే. చూడండి ఈ త్రాగుడు అలవాటు వున్న భర్తల భార్యలంతా కూడా ముందు చూపుతో ప్రవర్తించాలి. నా వరకు నేను సందు దొరికినప్పుడు మా ఆయన జేబులు ఖాళీ చేస్తాను. జీతం రాగానే కొన్ని తప్పు లెక్కలు చెప్పి ముక్కు పిండి మరీ వసూలు చేస్తాను తిరిగి ఆ డబ్బు ఆయనకే పెద్ద వడ్డీకి యిచ్చి మళ్ళీ వసూలు చేస్తాను. ఇన్ని చేస్తే కాని వారి బలహీనతలకు కళ్ళెం వేయలేక పోతున్నాను. భర్తనుఎదిరించి గొడవ పడటం కన్నా యిదే ఉత్తమమైన పద్ధతి. ఇది మీకు తెలియని మర్మం" అంది.

మళ్ళీ యిద్దర్నూ మనసారా నవ్వుకొన్నారు. ●